క్లుప్తంగా

ముగిసిన గురుచరిత్ర పారాయణ



గురుచరిత్ర పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: లోక కల్యాణం, ప్రజా సంక్షేమాన్ని కోరుతూ స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో 11 గురువారాలు చేపట్టిన గురుచరిత్ర పారాయణ ఈ వారంతో ముగిసింది. స్థానిక సాయి భక్త మండలి ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా గురు పూర్ణిమ నుంచి 11 గురువారాల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సాయిబాబాకు వేకువజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం ఈ పారాయణను ప్రారంభిస్తే మధ్యాహ్నం 2.30 గంటలకు పూర్తవుతుంది. ప్రతివారం సుమారు 30 మంది భక్తులు పాల్గొంటున్నారు. వచ్చే గురువారం 12వ వారంగా సాయి సచ్చరిత్రను పారాయణ చేయనున్నారు. ఈ 12 వారాలు గురు, సాయి సచ్చరిత్ర పారాయణలో పాల్గొన్న భక్తులకు ఆ రోజు సాయి సచ్చరిత్ర పుస్తకాలను బహుమతిగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

పెదపూడి: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ కార్యదర్శులను ఈఓపీఆర్డీ ఎంఎస్ఎన్ రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని కరకుదురు, రామేశ్వరం, పెదపూడి, దోమాడ గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అధికారులు గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్యం మరింత మెరుగుపరచాలన్నారు. దోమల నివారణకు ఏబేట్ మందును పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాస్‌చౌదరి, ప్రసన్నకుమార్, అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



సింగంపల్లిలో నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు

రంగంపేట: అర్హులందరికీ పింఛన్లు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు అన్నారు. సింగంపల్లి గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ తుట్టా శివశంకర ఆనంద్ అధ్యక్షతన గ్రామంలో మంజూరైన 39 నూతన పింఛన్లను బుధవారం ఆయన అవ్వాతాతలకు అందజేశారు. సింగంపల్లిలో మొత్తం 597 మందికి పింఛన్లు అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సోమిశెట్టి అప్పారావు, కార్యదర్శి ఎల్.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకల్లో నిబంధనలు తప్పనిసరి

గోకవరం: వినాయక చవితి వేడుకల్లో ఉత్సవ కమిటీ సభ్యులు విధిగా నిబంధనలు పాటించాలని కోరుకొండ సీఐ వై.ఉమామహేశ్వరరావు, గోకవరం ఎస్సై యువి శివనాగబాబు సూచించారు. గోకవరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు చేయడానికి పోలీసు, విద్యుత్‌శాఖ, ఫైర్ శాఖల అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రాత్రి సమయంలో విగ్రహాల వద్ద విధిగా కాపలా ఉండాలన్నారు. నిమజ్జనం సమయంలో వినియోగించే వాహనాల వివరాలను ముందుగా తమకు తెలియజేయాలన్నారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వరసాల ప్రసాద్, పాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరి

రంగంపేట: వినాయక చవితి వేడుకల కోసం మండపాల ఏర్పాటుకు పోలీసుల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండపాలు వేసే కమిటీ సభ్యుల వివరాలు పోలీసులకు అందించాలన్నారు. పబ్లిక్, ప్రైవేటు స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేస్తే స్థల యజమానుల అనుమతి తీసుకోవాలన్నారు. విద్యుత్, అగ్నిమాపక శాఖల అనుమతితో పాటు అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ట్రై సైకిళ్ల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలం కోటికేశవరంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా గురువారం ఇద్దరు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్, స్వర్ణాంధ్ర సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు.

పంటలకు ఎలుకల బెడద

- నష్టం కలిగిస్తున్న మూషికాలు
- ఆందోళనలో రైతులు
- సామూహిక నిర్మూలన చర్యలు చేపట్టాలంటున్న అధికారులు



వంగలపూడి వద్ద ఏపుగా పెరిగిన వరి పంట



వరి పంటను కొరికి వేస్తున్న ఎలుక

సీతానగరం: వరి, ఉద్యాన పంటలకు ఎలుకల బెడద ఎక్కువైంది. ముఖ్యంగా వరి పంటను మూషికాలు నాశనం చేస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో ఆకుమడుల దశ నుంచి వరి కుప్పల వరకూ ఈ సమస్య రైతులకు తప్పడం లేదు. రబీలో మొక్కజొన్న, అపరాల పంటలకు కూడా ఈ ఇబ్బందే ఎదురవుతోంది. ఈ కారణంగా పలు విధాలుగా రైతులు నష్టపోతున్నారు. పంట వేసినప్పటి నుంచీ పంట వచ్చే వరకూ ఎలుకల దాడి కొనసాగుతోంది. వీటిని అరికట్టాలంటే రైతులందరూ సామూహిక ఎలుకల నిర్మూలన చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

53 వేల ఎకరాలు

నియోజకవర్గంలోని 53 వేల ఎకరాల వరి, ఉద్యాన పంటలకు ఎలుకల బెడద తప్పడం లేదు. సీతానగరం మండలంలో 14 వేల ఎకరాల్లో వరి, 4 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు, కోరుకొండ మండలంలో వరి 15 వేల ఎకరాలు, రాజానగరం మండలంలో వరి 12 వేల ఎకరాలు, ఉద్యాన పంటలు 10 వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఇందులో సుమారు 40 వేల ఎకరాల్లో ఉంటోంది. ప్రస్తుతం పంట దుబ్బు చేసి పిలుకలు వేసే దశలోనూ, మోటార్ల వద్ద ముందుగా వేసిన వరిపంట పొట్ట దశలో ఉంది. దీంతో ఎలుకల బెడద ఎక్కువగా ఉంది. ఇవి నీటి మట్టానికి 6 సెంటీమీటర్లు మించిన ఎత్తులో వరి పిలకలను కొరికి వేస్తున్నాయి. చిరు దశలో ఎలుకలు కలిగించే నష్టం ఎక్కువగా ఉంటుంది. దీనితో ఖాళీలు ఏర్పడి పంట ఎండిపోయినట్లు కనిపిస్తుంది. దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది.

గుర్తించే విధానం

ఎలుకలు సంచరించే పొలం గట్లుపై బొరియలు ఉంటాయి. పొలంలో కొరికి వేసిన వరి పిలకలు, దుబ్బులు పడి ఉంటాయి. పొలంలోని బురదలో ఎలుకల పాదముద్రలు కనిపిస్తాయి. ఎలుకలు విసర్జించిన పదార్థాల ద్వారా వాటి ఉనికిని గుర్తించవచ్చు

నివారణా చర్యలు

రైతులు తమ పొలం గట్లపై కలుపు, మొక్కలను తొలగించాలి. గట్లను శుభ్రం చేయాలి. రైతు భరోసా కేంద్రాల ద్వారా బ్రొమోడయోలోన్ అనే ఎరను రైతులకు ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేస్తుంది. రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాల్సి ఉంటుంది. 480 గ్రాముల నూకలు, 10 గ్రాముల బ్రొమోడయోలోన్ మందు, 10 గ్రాముల నూనెలతో 500 గ్రాముల మందు 50 ఎలుకల బొరియలకు సరిపోతుంది. మొదటి రోజు ఎలుకల బొరియలు మట్టితో కప్పివేయాలి. రెండవ రోజు తెరుచుకున్న బొరియలలో 10 గ్రాముల చొప్పున కట్టిన మందు పొట్లాలను ఒకటి చొప్పున వేయాలి. దీనిని రైతులందరూ సామూహికంగా చేపట్టాల్సి ఉంటుంది.

సామూహికంగా చేపట్టాలి



ఖరీఫ్ సీజన్‌లో ఎలుకల బెడద ఎక్కువగా ఉంటుంది. దీని నిర్మూలనకు బ్రొమోడయోలోన్ మందు కొద్ది రోజులలో ఆర్బీకేలకు వస్తుంది. దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, గ్రామాల వారీగా మందును త్వరలో అందిస్తాం. రైతులు తమ పంటపొలాల్లోనే కాకుండా, చుట్టుపక్కల స్థలాల్లోని బొరియలు వద్ద వేయాలి. రైతులందరూ సామూహికంగా చేపడితే ఎలుకల నిర్మూలన సాధ్యమవుతుంది.

– కె.సూర్య రమేష్, ఏవో, సీతానగరం

మట్టి వినాయకుని బొమ్మల పంపిణీ



మట్టి వినాయకుని బొమ్మలను తయారుచేస్తున్న విద్యార్థులు

రాజానగరం: విద్యార్థులకు తరగతి గదుల్లో విజ్ఞానాన్ని బోధించడమే కాదు, పండగలపై కూడా అవగాహన కలిగించడం గురువుల బాధ్యతని దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఉపాధ్యాయులు అంటున్నారు. వినాయక చవితి సందర్భంగా మట్టితో వినాయకుని బొమ్మలు విద్యార్థులతో తయారు చేయించి, రాజానగరం, రాజమహేంద్రవరం, కడియం, రంగంపేట, గండేపల్లి, కోరుకొండ, సీతానగరం మండలాలలోని ప్రముఖులకు అందజేసే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. సుమారు వెయ్యి బొమ్మలను తయారు చేసిన విద్యార్థుల ద్వారానే ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. ఇదే విధంగా నియోజకవర్గంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కూడా తమ ఉపాధ్యాయుల సూచనలతో వినాయకుడి ప్రతిమలను తయారుచేసి, ఆయా గ్రామాలలో పెద్దలకు అందజేస్తున్నారు.

పౌష్టికాహార ఆవశ్యకతను గుర్తించాలి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పౌష్టికాహార ఆవశ్యకతను అందరూ గుర్తించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పోషణ్ మాహ్ 2023 కార్యక్రమాన్ని గురువారం స్థానిక వర్తక సంఘం కల్యాణ మండపం ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తోందన్నారు. ఆకుకూరల్లో పోషకాలు మెండుగా ఉంటాయని, ఆకుకూరలు, గుడ్లు, పాలు, తాజా పండ్లు, పప్పుదినుసులను రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలని ఆయన గర్భిణులు, బాలింతలకు సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పూర్తి స్థాయిలో పౌష్టికాహారం అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సీడీపీఓ జెస్సీ ఫోరెన్స్, రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ చైర్మన్ షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ నియోజవకర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, పోతుల ప్రసాదరెడ్డి, కోనాల సత్యనారాయణరెడ్డి, సత్తి హరిప్రసాదరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్.ఛాయాదేవి, ఏవీ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బలభద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



బలభద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బలభద్రపురంలో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. నవరత్నాల పేరిట ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని చెప్పారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ఆసుపత్రిల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఏపీ నంబర్ వన్ అని చెప్పారు. ఇలాంటి సీఎం సుదీర్ఘ కాలం కొనసాగితే మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుంగా రామారావు, ఎంపీటీసీ మేడపాటి ఆనంద రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీవీ సత్యనారాయణ రెడ్డి, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, చిన్నం వీర్రాఘవ రెడ్డి, సబ్బెళ్ల వీరాఘవరెడ్డి, నల్లమిల్లి రామచంద్రారెడ్డి, గుబ్బల లాజర్‌బాబు, కొవ్వూరి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఆలయాల ప్రతినిధులకు చెక్కులు అందజేత



కానవరం కనకదుర్గమ్మ ఆలయానికి మంజూరైన చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: టీటీడీ, శ్రీవాణి ట్రస్టు సహకారంతో నియోజకవర్గంలోని దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. రాజమహేంద్రవరం ప్రకాశం నగర్‌లోని తన కార్యాలయంలో గురువారం మండలంలోని ఆరు ఆలయాలకు తొలి విడతగా మంజూరైన రూ.19.98 లక్షల నిధులకు సంబంధించిన చెక్కులను ఆయా ఆలయాల ప్రతినిధులకు అందజేశారు. సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలో ఈ విధంగా 117 ఆలయాలను అభివృద్ధి పరిచేలా ప్రతిపాదనలు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. చాలాచోట్ల పూర్వీకులు కట్టించిన దేవాలయాలను ఆ తరువాత పట్టించుకున్న వారు లేకపోయారన్నారు. దీనితో కొన్నిచోట్ల పునర్నిర్మాణం చేయాల్సి వస్తోందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్టు సహకారంతో ఒక్కో ఆలయానికి రూ. 10 లక్షలు నిధులు కేటాయించే అవకాశం ఉందన్నారు. సీతారామపురంలోని శ్రీకృష్ణ గీతామందిరం, కానవరంలోని కనకదుర్గమ్మ, భూపాలపట్నంలోని ఆంజనేయస్వామి, కోరుకొండలో పోలేరమ్మ, జగన్నాథపురం, కణుపూరులోని వేంకటేశ్వస్వామి ఆలయాల నిర్మాణం కోసం.. ఒక్కో ఆలయానికి రూ.3.33 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. మిగిలిన ఆలయాలకు కూడా త్వరలోనే నిధులు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయా ఆలయాలకు సంబంధించిన చైర్మన్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకే సంక్షేమ పథకాలు

- రూ.6.38 కోట్లతో కోటికేశవరం అభివృద్ధి
- గడపగడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కోటికేశవరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: పేదరికం నిర్మూలన కోసం రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కోటికేశవరంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన కార్యక్రమం బీసీ, ఓసీ ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. స్థానికులు తెలిపిన మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణం తదితర వాటిపై హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకూ రూ.6.38 కోట్లు కేటాయించామన్నారు. తాగునీటి ఎద్దడి నివారణకు రూ.64 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించామన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకూ జరిగిన ఈ కార్యక్రమంలో 400 గడపలు తిరిగారు.

గ్రామాల్లో అభివృద్ధి పరుగులు

ఎమ్మెల్యే రాజా విలేకరులతో మాట్లాడుతూ జగన్ పాలనలో పల్లెల్లో ప్రగతి పరుగులు తీస్తోందన్నారు. దానిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు నిందారోపణలు చేస్తున్నాయన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ది ములాకత్ కాదు, మిలాకత్ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయి జైలు పాలయిన చంద్రబాబును పవన్ కల్యాణ్ కలవడం ద్వారా దొంగలు, దొంగలు ఊళ్లు పంచుకోవడానికి కుట్రలు చేస్తున్నట్టుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముడే సింధూ దివ్య, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ములగాడ ఫణి, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ గణేశుల పోసి, నాయకులు కొండపల్లి దుర్గారావు, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, ఎంపీటీసీ నేతల బుజ్జి, పార్టీ నాయకులు ముడే కామేష్, ముంద్రు రాంబాబు, దేవరపల్లి బోసు, ఎస్.భలరాముడు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



దోసకాయలపల్లిలో పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు



సంపరలో ఉత్కంఠగా సాగుతున్న కబడ్డీ పోటీలు



గెలుపొందిన విద్యార్థులను మెడల్స్‌తో సత్కరిస్తున్న జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు చంద్రన్న

మధురపూడి: బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి హైస్కూల్లో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి టోర్నమెంట్, సెలెక్షన్లు జరిగాయి. అండర్ 17, 14 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వీటిని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనతో పాటు క్రీడలకూ ఎంతో ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి, పోటీలను ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ కోర్టుల్లో కొద్దిసేపు ఆడి, క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. మండలంలోని 10 ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లకు చెందిన 10 జట్లు పోటీ పడ్డాయి. ప్రతిభ చూపిన విద్యార్థినులు నియోజకవర్గం స్థాయి పోటీలకు ఎంపికవుతారు.

ఉత్కంఠ భరితంగా పోటీలు

బాలికల క్రీడా పోటీలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. అండర్ 17 విభాగం కబడ్డీలో కణుపూరు విన్నర్‌గా, శ్రీరంగపట్నం రన్నర్‌గా నిలిచాయి. అండర్ 14 విభాగంలో దోసకాయలపల్లి విజేతగా, బూరుగుపూడి రన్నర్‌గా నిలిచాయి. టెన్నికాయిట్‌లో గుమ్ములూరు విన్నర్‌గా, కోరుకొండ రన్నర్‌గా నిలిచాయి. కార్యక్రమంలో ఎంఈఓలు టి.కుశలవ దొర, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అథ్లెటిక్స్ పోటీలు

దోసకాయలపల్లి హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం బాలురు, బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ కుశలవదొర తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

పెదపూడి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. గురువారం మండలంలోని సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసానికి తోడ్పడతాయన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడల్లో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, హెచ్ఎం త్రిమూర్తులు, పీడీ గిరి, ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి స్కూల్ గేమ్స్

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద నిర్వహిస్తున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్ గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పి.వీరప్రభాకర్ మాట్లాడుతూ బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో బిక్కవోలు, వాలీబాల్‌లో ఊలపల్లి, ఖోఖోలో పందలపాక పాఠశాలలు ప్రథమ స్థానంలో నిలిచాయన్నారు. కబడ్డీ అండర్-14లో ఇళ్లపల్లి, అండర్-17లో కొంకుదురు ప్రథమ స్థానం సాధించాయని చెప్పారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించేలా కృషి చేయాలి

రంగంపేట: విద్యార్థులు క్రీడల్లో రాణించేలా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన పాఠశాల క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం కోకో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, షార్ట్‌పుట్, లాంగ్ జంప్, డిస్కస్ త్రో తదితర క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ వేసి సత్కరించారు. మండల స్పోర్ట్స్ సమన్వయకర్త వై.వెంకటేశ్వర్లు, పీడీ బాపిరాజు, నాగేశ్వరరావు, శైల, బూరిబాబు తదితరుల కృషిని ఎంఈఓ కె.శ్రీనివాసరావు అభినందించారు.

రాజానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయిలో మూడు రోజులుగా జరుగుతున్న స్కూల్ గేమ్స్ టోర్నమెంట్స్ గురువారంతో ముగిశాయి. మొదటి రోజున అండర్ 17 విభాగంలో బాలురకు, రెండో రోజు అండర్ 14 బాలురకు, మూడో రోజు 14, 17 విభాగాలలో బాలికలకు వాలీబాల్, కబడ్డీ, కోకో, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నీ కాయిట్, త్రోబాల్, యోగా, అథ్లెటిక్స్‌లో ఈ గేమ్స్ కమ్ సెలక్షన్స్ జరిగాయని ఎంఈఓలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్ తెలిపారు. ఎంపికైన వారిని జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామన్నారు. ఉప విద్యా శాఖాధికారి కె.నారాయణరావు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సుబ్బలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ విలువలు నేర్పాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు



ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

గోకవరం: ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు వ్యక్తిత్వ విలువలు నేర్పాలని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాలులో గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సుంకర వెంకటరమణ, సావిత్రి ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు రాజ్యాంగ విలువలు నేర్పాలన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు ఎస్.ఉమామహేశ్వరరావు, మండల ఉత్తమ ఉపాధ్యాయులు బీబీటీ దొర, ఎ.జోగిరాజు, జి.స్వర్ణలత, పీపీ లచ్చిరెడ్డి, బి.మహేశ్వరరావులను ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ తదితరులతో కలిసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావును ఉపాధ్యాయులు, ఎంపీపీ సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో దాసరి తమ్మన్నదొర, సుంకర వెంకటరమణ, సుంకర వీరబాబు, దాసరి చిన్నబాబు, కర్రి సూరారెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్‌కు గుర్తింపుపై హర్షం

గోకవరం: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్‌కు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని ఆర్టీసీ గోకవరం డిపో యూనియన్ చైర్మన్ పైడిమళ్ల లక్ష్మణ్‌రావు, అధ్యక్షుడు ప్రగడ ప్రసాద్, కార్యదర్శి అక్కిరెడ్డి కృష్ణ అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన తరువాత అధికంగా ఉద్యోగులు ఉన్న ఎంప్లాయీస్ యూనియన్‌కు గుర్తింపు ఇచ్చి ఉద్యోగుల సమస్యలపై అధికారికంగా మాట్లాడే అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.